
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

3 సిద్దిపేట
సోమవారం 13 జనవరి 2025



సంక్రాంతి సందడి..

- పల్లెలు, పట్టణాలకు శోభ
- నేడు భోగి

మెదక్అర్బన్/సంగారెడ్డి రూరల్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): పల్లెకు పండుగొచ్చింది. సంబురాలు పూయించే సంక్రాంతి వచ్చింది. వాకిళ్లకు వర్ణకాంతులను, ఇంటిల్లిపాదికి సకల సౌభాగ్యాలను మోసుకొచ్చింది. గంగిరెద్దుల విన్యాసాలు.. ముత్యాల ముగ్గులు.. పతంగుల ఆటలు.. ఇళ్లకు చేరే బంధువులు... అన్నింటికీ మించి రైతన్న ఇళ్లకు చేరే పంట సిరులతో ఊరువాడా సందడి నెలకొన్నది. ఎక్కడెక్కడి నుంచో చేరిన కుమారులు, కోడళ్లు, బిడ్డలు, అల్లుళ్లు, పిల్లా పాపలతో ఇల్లిల్లూ కళకళలాడుతోంది. ఊరువాడ భోగి, సంక్రాంతి, కనుమ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సోమవారం భోగి పండుగను జరుపుకోనున్నారు. దీంతో మార్కెట్లు రద్దీగా మారాయి. రంగులు, గరిక, పేడ, రేగు పండ్లు కొనుగోలు చేస్తున్నారు.

మూడు రోజుల పాటు సంబురం

మూడు రోజుల పాటు సంబురాలు కొనసాగనున్నాయి. ఇప్పటికే ఇళ్లల్లో మహిళలు పిండివంటలు చేస్తూ ఘుమఘుమలాడిస్తున్నారు. మహిళలు వాకిళ్లను రంగురంగుల ముగ్గులతో నింపి, వాటి మధ్య ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను పెడుతారు. వాటిపై గరక పోసలు ఉంచి. చుట్టూ నవధాన్యాలు, పళ్లు పోస్తారు. ఇలా చేయడం వల్ల లక్ష్మీ దేవి తమ ఇళ్లలోకి వస్తుందని నమ్ముతారు. భోగి రోజున తెల్లవారుజామున పిల్లలకు తలస్నానం చేయించి రేగు పండ్లు, చెరుకు ముక్కలు, అక్షింతలు కలిసి వారి తలలపై పోయడం ద్వారా దృష్టి దోషం తొలగిపోతుందని పెద్దలు నమ్ముతారు.

మార్కెట్లు కళకళ

పండుగ వేళ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ముగ్గులు వేసేందుకు మహిళలు రంగులను కొనుగోలు చేస్తున్నారు. రంగులకు గిరాకీ పెరగడంతో మొన్నటివరకు ఒక ప్యాకెట్ ధర రూ.10 ఉండగా ప్రస్తుతం రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. రేగుపండ్లు, గరికపోసలు, మామిడి, పూల ధరలకు రెక్కలొచ్చాయి. ఆవుపేడను సైతం మార్కెట్లలో విక్రయిస్తున్నారు. గాలిపటాల విషయానికి వస్తే చిన్న సైజు పతంగి గతంలో రూ.5 ఉండగా ప్రస్తుతం రూ.15కి విక్రయిస్తున్నారు. పెద్దసైజు గాలిపటం ధర మొన్నటివరకు రూ.30 ఉండగా, రూ.60 నుంచి రూ.75 వరకు విక్రయిస్తున్నారు.

సంగారెడ్డి హాస్టల్‌గడ్డలోని దర్గాలో జగ్గారెడ్డి

ఉర్సు, ఖవ్వాలి కార్యక్రమాల్లో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్


హాస్టల్‌గడ్డ దర్గా ఉర్సులో పాల్గొన్న జగ్గారెడ్డి


మతపెద్దలతో కలిసి ఖవ్వాలి కార్యక్రమాన్ని వీక్షిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని హాస్టల్‌గడ్డ దర్గాలో ఉర్సు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు, ఖవ్వాలి కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మత పెద్దలను ఘనంగా సత్కరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దర్గా నిర్వాహకులు జగ్గారెడ్డిని సన్మానించారు.

పండుగపూట ధరల మోత



నూనెలు సలసల

- దాదాపు 20 శాతం మేర పెంపు
- నింగినంటుతున్న నిత్యావసరాలు
- సామాన్య కుటుంబాలు విలవిల

సంక్రాంతి పండుగంటేనే వాకిళ్లు రంగురంగుల ముగ్గులతో మురిసిపోతే.. వంటిల్లు ఘుమఘుమలతో ఊరిస్తాయి. అందులోనూ పిండి వంటలు ప్రత్యేకం. వీటి తయారీకి ఉపయోగించే నూనె ధరలు మాత్రం ప్రస్తుతం వంటింట్లో మంటలు రేపుతున్నాయి. ఆ సెగలకు సామాన్యులు విలవిలలాడుతున్నారు. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు దడ పుట్టిస్తున్నాయి. దీంతో పేదలు, మధ్యతరగతి కుటుంబాలు దిక్కులు చూడాల్సి వస్తున్నది. పండుగకు ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదని ఆందోళన చెందుతున్నారు.

సిద్దిపేటకల్చరల్ జనవరి 12(ఆంధ్రజ్యోతి): నిత్యావసర ధరలు భగ్గుమంటున్నాయి. వంట నూనె ధరలు ఆకాశన్నంటుతున్నాయి. రోజురోజుకూ రేట్లు ఎగబాకుతున్నాయి. దీంతో పండుగ వేళ సామాన్యులకు భారం తప్పడం లేదు. మూడు నెలల క్రితం ప్యాకెట్ నూనె ధరకు, ప్రస్తుతానికి రూ.40 వరకు తేడా కనిపిస్తుంది. ఇంతలా ధర పెరగడంతో సామాన్యులు రోజు కూర వండుకోవడానికే సంకోచించుతుంటే, పండగ వేళ మరింత భారంగా మారింది. ఈసారి పండుగకు సకినాలు, మురుకులు, అరిసెలు, గరిజలు, చేగోడీలు ఇలా రకరకాల పిండివంటలు చేసుకునేందుకు జేబులకు చిల్లు తప్పడం లేదు.

మూడు నెలల్లో రెండుసార్లు

మూడు నెలల కాలంలోనే రెండుసార్లు నూనెల ధరలు పెరిగాయి. ఒక్కో రకం ఆయిల్‌ను బట్టి 10 నుంచి 20 శాతం ధరలు పెంచేశారు.



వంట నూనెల ధరలు (లీ.ప్యాకెట్)

నూనెరకం	మూడు నెలల క్రితం	ప్రస్తుతం
పామాయిల్	రూ.95	రూ.138
సన్‌ఫ్లవర్	రూ.110	రూ.150
వేరుశనగ	రూ.120	రూ.185
రైస్‌బ్రాండ్	రూ.130	రూ.210

మూడునెలల క్రితం ప్యాకెట్ సన్‌ఫ్లవర్ నూనె కిలో రూ.110కు లభ్యమయ్యేది. పల్లినూనె రూ.120, రైస్‌బ్రాండ్ రూ.130 ఉండేవి. ప్రస్తుతం సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ రూ.150, పల్లినూనె రూ.185, రైస్‌బ్రాండ్ రూ.190-210 వరకు బ్రాండ్లను బట్టి రేట్లు ఉన్నాయి. ఇక పామాయిల్ ధరలయితే గతంలో రూ.95 రూపాయలుంటే ప్రస్తుతం రూ.135 నుంచి 138 వరకు వరకు కంపెనీని బట్టి విక్రయిస్తున్నారు. పిండివంటలకు ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్ కూస్తా సాధారణ నూనెల వరుసలోనే చేరింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగే విజయ బ్రాండు నూనెల రెట్లు మండిపోతున్నాయి.

వెల్లుల్లి ఘాటు.. ఉడుకుతున్న పప్పులు

పండుగ పూట ఎక్కువగా అవసరమయ్యే పప్పులు, గోదుమపిండి,

మిగతా 5వ పేజీలో


ఆసుపత్రిలోని రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద పేరు నమోదు చేసుకుంటున్న రోగులు

పేరుకే పెద్దాస్పత్రి.. రోగులపై చిన్నచూపు!

- జీజీహెచ్‌కు నిత్యం వైద్యం కోసం వస్తున్న వేలాది మంది
- రోగులతో పాటు వారి బంధువులపై సిబ్బంది చిందులు
- కిందిస్థాయి నుంచి అధికారుల వరకు ఇదే తంతు
- జీజీహెచ్ ప్రతిష్ఠకు మచ్చ



సిద్దిపేట టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం వచ్చిన రోగి, బంధువులతో అనుచితంగా ప్రవర్తిస్తూ ఇక్కడికి ఎందుకొచ్చామా అనుకునేట్లు చేస్తున్నారు ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది.. మొన్నటివరకు ఉత్తమంగా నిలుస్తూ వచ్చిన సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో (జీజీహెచ్)ని కిందిస్థాయి నుంచి మొదలుకొని పలువురు వైద్య సిబ్బంది, అధికారుల వరకు అందరిలోనూ రానురాను నిర్లక్ష్య ధోరణి పెరిగిపోతున్నది. సహనంతో వ్యవహరిస్తూ చికిత్స అందించాల్సిన చోట చిర్రుబుర్రులాడుతున్నారు. పే..ద్ద ఆస్పత్రిగా పేరుతెచ్చుకున్నా, ఇక్కడికి వచ్చే వారితో మాత్రం చిన్నచూపుతో వ్యవహరించడం విమర్శలకు దారితీస్తున్నది.

అన్ని సౌకర్యాలున్నాయని వస్తే ఇదేం తీరు!

జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో మెరుగైన వైద్యం అందించేందుకు జీజీహెచ్‌లో గత ప్రభుత్వ హయాంలో 300 పడకలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను సమకూర్చారు. రెండు ఐసీయూ కేంద్రాలు, డయాలసిస్, ఎస్ఎన్‌సీయూ, ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్, గర్భిణులకు శస్త్రచికిత్స లాంటి సేవలను ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో సిద్దిపేట నుంచే కాకుండా చుట్టు పక్క జిల్లాల నుంచి నిత్యం వెయ్యి మంది వరకు వివిధ చికిత్సల కోసం ఇక్కడికి వస్తున్నారు. కానీ కొంత కాలంగా ఆసుపత్రిలో కొందరు వ్యవహరిస్తున్న తీరుమాత్రం జీజీహెచ్ ప్రతిష్ఠను తగ్గిస్తుండటం బాధాకరమనే చెప్పవచ్చు. జీజీహెచ్‌లో చేరిన రోగితో పాటు అతని బంధువులపై వాచ్‌మన్, సెక్యూరిటీ, ఆయాలు, నర్సులు,

మిగతా 6వ పేజీలో

పారదర్శకంగా వైద్యసేవలు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి
- నార్మల్ డెలివరీలపై ప్రత్యేక దృష్టి
- నెలాఖరుకు గజ్వేల్ ఎంసీహెచ్ ప్రారంభిస్తాం
- జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


మాట్లాడుతున్న అన్నపూర్ణ

గజ్వేల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచడమే లక్ష్యంగా పనిచేస్తామని, ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ వైద్య సేవలు అందిస్తామని గజ్వేల్‌లోని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. త్వరలోనే గజ్వేల్‌లోని మాతాశిశు ఆసుపత్రి భవనంలో సేవలను అందుబాటులోకి తీసుకుస్తామంటున్న డాక్టర్ అన్నపూర్ణతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

గతంలో ఎక్కడ పనిచేశారు?

గతంలో నిజామాబాద్ జిల్లాలో ఎక్కువ కాలం పని చేశా. నిజామాబాద్ మెడికల్ కళాశాల, నిజామాబాద్ జిల్లా ఆసుపత్రిలో ఎనిమిదేళ్ల పాటు పనిచేశా. గజ్వేల్ జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రావడం సంతోషంగా ఉంది. ఇక్కడి ప్రజలకు పారదర్శక సేవలను అందించేందుకు కృషిచేస్తా.

గజ్వేల్‌లోని ఎంసీహెచ్ భవనాన్ని ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారు?

ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా కృషిచేస్తాం. ముఖ్యంగా ఆపరేషన్ థియేటర్‌లో పరికరాలు రావాల్సి ఉంది. నూతన భవనంలో లిఫ్ట్ అందుబాటులోకి రాలేదు. పది రోజుల్లో లిఫ్ట్ అందుబాటులోకి రానుంది. ఎంసీహెచ్ ఆసుపత్రికి కావాల్సిన డాక్టర్స్, అనస్తీషియన్స్, నర్సులు, ఇతర సిబ్బంది కేటాయింపు జరగాల్సి ఉంది. అయినప్పటికీ ప్రస్తుతం ఉన్న సిబ్బంది, డాక్టర్లతో త్వరలోనే కొత్త భవనంలోకి మాతా, శిశు విభాగాన్ని తరలిస్తాం.

ఎన్ఐసీయూ ఏర్పాటు చేస్తారా?

మాత శిశువు నూతన ఆసుపత్రిలో ఎన్ఐసీయు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం. ప్రస్తుతం గైనకాలజీ విభాగంతో పాటు శిశువుల కోసం ప్రత్యేకంగా ఎస్ఎన్‌సీయూను కొనసాగిస్తున్నాం. అదే విభాగాన్ని నూతన ఆసుపత్రిలోకి తరలిస్తాం. రెండు మూడు నెలల్లో పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో సాధారణ ప్రసూతిలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఆపరేషన్ల(సీ-సెక్షన్) జోలికి వెళ్లకుండా సాధారణ ప్రసూతిలు జరిపేందుకు డాక్టర్లు, నర్సులతో ప్రత్యేక కార్యాచరణ చేపడతాం. సెక్షన్ డెలివరీల వల్ల జరిగే నష్టాన్ని ప్రసూతికి వచ్చే మహిళలతోపాటు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తాం.

మిడ్‌వైఫరీ విధానాన్ని పునఃప్రారంభిస్తారా?

గతంలో జిల్లా ఆసుపత్రిలో మిడ్ వైఫరీ విధానంతో ఇక్కడ సాధారణ ప్రసూతిలు జరిగాయి. ఈ మధ్యలో సాంకేతిక కారణాలు, నర్సుల బదిలీల కారణంగా మిడ్ వైఫరీ సేవలు నిలిచిపోయాయి. ఈ విషయంపై ప్రత్యేక ఫోకస్ పెట్టి మిడ్‌వైఫరీ విధానాన్ని త్వరలోనే జిల్లా ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకొస్తాం. ఈ విధానం అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దూరదృష్టితో మిడ్‌వైఫరీ విధానాన్ని తీసుకువచ్చేందుకు కృషిచేస్తాం.

ప్రసూతికి వచ్చే మహిళలకు మీరు ఇచ్చే సలహా?

గర్భం దాల్చిన ప్రతీ మహిళ క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదిస్తూ, ఆయా టెస్టులు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు నడుచుకోవాలి. ముఖ్యంగా తాజా కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ లాంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలి. సాధారణ ప్రసవానికి ప్రాముఖ్యతను ఇవ్వాలి. తప్పనిసరి పరిస్థితుల్లోనే సెక్షన్ వైపు వెళ్లాలి.

కనులపండువగా గోదాదేవి కల్యాణం

- పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు..
- స్వామి వారికి పట్టువస్త్రాల సమర్పణ

సిద్దిపేటకల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా గోదా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం సిద్దిపేట గణేష్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో కనుల పండువగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. స్వామి వారికి హరీశ్‌రావు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయనను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ దైవ నామస్మరణ, భగవత్ సేవలో మానసిక ప్రశాంతత, జీవితానికి అర్థం దొరుకుతుందని అన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో చేపడుతున్న కార్యక్రమాలు చాలా గొప్పగా ఉంటాయన్నారు. హనుమాన్ భక్తులకు అన్నప్రసాద వితరణ, ప్రతి సంవత్సరం సీతారాముల కల్యాణం, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలన్నీ ప్రత్యేకంగా ఉంటాయన్నారు.

వేంకటేశ్వరాలయంలో...

సిద్దిపేటలోని వేంకటేశ్వరాలయం(పాతది)లో గోదాదేవి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి సేవా సమితి, మహిళ గోష్టి ఆధ్వర్యంలో ఆదివారం గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.


గోదా రంగనాథ స్వామి కల్యాణంలో పాల్గొన్న హరీశ్‌రావు

మల్లన్న ఆలయంలో భక్తజనసందోహం

చేర్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానమాచరించారు. అభిషేకం, నిత్యకళ్యాణం నిర్వహించారు. ముఖమండప పట్నాలు రచించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యం, పట్టువస్త్రాలు, బండారి సమర్పించారు. తమ కోర్కెలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. మల్లన్న సహోదరి ఎల్లమ్మ తల్లికి బోనం నివేదించి కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడిబియ్యం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు. గంగిరేగుచెట్టు ప్రాంగణంలో ప్రహరీ గోడ నల్లా వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. సమీప ప్రదేశంలో చిత్తడిగా మారి పారిశుధ్య చర్యలు లోపించడంతో భక్తులు ఇబ్బందులుపడ్డారు


నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

రుణయాప్‌లలో అప్పు చేసి..

ఆన్‌లైన్‌లో బెట్టింగులు

● రూ. 10 లక్షల బాకీ తీర్చలేక హైదరాబాద్‌లో యువకుడి ఆత్మహత్య

రామాయంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రుణయాప్‌లలో అప్పు చేసి ఆన్‌లైన్ బెట్టింగుల్లో పెట్టి పోగొట్టుకున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్‌లో జరిగింది. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన చాకలి ప్రశాంత్(24) కుటుంబం హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో స్థిరపడింది. తూంకుంట వద్ద ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ప్రశాంత్ రుణయాప్‌ల నుంచి రూ.10 లక్షల వరకు అప్పులు చేసి ఆన్‌లైన్ బెట్టింగుల్లో పెట్టి పోగొట్టుకున్నాడు. దీంతో అప్పు తీర్చాలంటూ రుణయాప్ నిర్వాహకులు వేధించసాగారు. అప్పు తీర్చే మార్గం కనిపించక శనివారం అర్ధరాత్రి తూంకుంట శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని ప్రశాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొండపోచమ్మసాగర్ వద్ద ఘటనా స్థలాన్ని పరిశీలించిన వీహెచ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హన్మంతరావు

మర్కుక్, ములుగు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు ఐదుగురు మునిగి చనిపోవడంపై కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విచారం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానన్నారు.

మోతీమాత జాతర ప్రారంభం



అమ్మవారి సన్నిధికి తరలివస్తున్న గిరిజన మహిళలు

జహీరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లితండా శివారులోగల మోతీమాత ఆలయంలో జాతర వైభవంగా ప్రారంభమైంది. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కిషన్‌రావ్ పవార్, అసోసియేట్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేమసింగ్‌రాథోడ్, ఉపాధ్యక్షుడు నారాయణజాదవ్, ప్రధాన కార్యదర్శి పవన్‌రాథోడ్, టీబీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాంరాథోడ్, నాయకులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



గొల్లపల్లిలో మల్లికార్జునస్వామి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

నర్సాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం గొల్లపల్లిలోని కేతకీ మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాధామల్లేశ్‌గౌడ్ పర్యవేక్షణలో ఉత్సవాలను నిర్వహించగా ఇందులో భాగంగా స్వామివారిని వేదపండితులు హరిప్రసాద్‌శర్మ నేతృత్వంలో అలంకరించి పూజలు నిర్వహించారు.

మెడికల్ కాలేజీ నియామకాల్లో నిబంధనలు పాటించాలి



సంగారెడ్డి ఆస్పత్రి ప్రాంగణంలో కార్మికులతో మాట్లాడుతున్న మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి

సంగారెడ్డి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ కింద చేపడుతున్న నియామకాల్లో నిబంధనలు పాటించాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఏజెన్సీలకు వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్నవారికే ఉద్యోగాలివ్వడం దారుణమన్నారు. ఆస్పత్రిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను కాదని ఇతరులకు ఔట్‌సోర్సింగ్ కింద ఉద్యోగాలివ్వడం అన్యాయమని దుయ్యబట్టారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నియామకాల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని లేదా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు సదానందం, మహేందర్, నాగరాజు, సునీత, లక్ష్మణ్, శ్రీనివాస్, నాగార్జున, భాగ్యలక్ష్మి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రింగు రోడ్డు పనుల పరిశీలన

నారాయణఖేడ్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ చుట్టూరా బిట్లు బిట్లుగా నిర్మిస్తున్న రింగు రోడ్డు పనులను ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్ చౌహాన్, మాజిద్, నర్సింలు, మూడ రామక్రిష్ణ, హన్మాండ్లు పరిశీలించారు. 161 బీ జాతీయ రహదారిలోని మనూరు క్రాస్ రోడ్డు నుంచి ఖేడ్- కంగ్టి రోడ్డు వరకు ఒక పార్ట్‌గా, అక్కడి నుంచి చాంద్‌ఖాన్‌పల్లి వరకు అలాగే వెంకటేశ్వర స్వామి ఆలయం, డీఎస్పీ కార్యాలయం సమీపంలోని 161 బీ జాతీయ రహదారిని కలుపుతూ బిట్లు బిట్లుగా రోడ్డును నిర్మిస్తున్నారు. రోడ్డుతో పాటు నిర్మించనున్న ప్రాంతాలను వారు పరిశీలించారు. ఈ రోడ్డువల్ల ఖేడ్‌లో ట్రాఫిక్ సమస్యలు తీరడంతో పాటు పలు మండలాల వారికి దూరభారం తగ్గుతుందని, భూములకు రోడ్డు సదుపాయం ఏర్పడమే కాకుండా, రైతులకు మేలు చేకూరుతుందని వారు వివరించారు.

బసవన్నా.. విన్యాసాలేవన్నా..

- ఆదరణ లేక కనుమరుగు
- పట్నాల్లో అక్కడక్కడా దర్శనం
- ఉపాధి లేక ఇతర వృత్తుల్లోకి

దూ దూ బసవన్నా.. ఇటు రారా బసవన్నా.. అమ్మవారికి దండం పెట్టు.. అయ్యాగారికి దండం పెట్టు.. మన సుబ్బు గారికి దండం పెట్టు.. అంటూ గంగిరెద్దుల కులస్థులు ఊరూరా చేసే సందడి కనుమరుగవుతున్నది. నేడు ఆదరణ కరువవడంతో వారు ఈ వృత్తిని వీడి ఇతర పనుల చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.



హుస్నాబాద్/చిన్నశంకరంపేట, జనవరి 12 (ఆంధ్ర జ్యోతి) : సంక్రాంతి పండుగకు ప్రత్యేకంగా గుర్తుకు వచ్చేది గంగిరెద్దుల విన్యాసాలే. గంగిరెద్దుల కులస్థులు ఊరూరా తిరుగుతూ బసవన్నలతో ఆటలాడిస్తూ సందడి చేస్తుంటారు. నేటి ఆధునిక యుగంలో ఈ సంప్రదాయాలు కనుమరుగవతున్నాయి. రానురాను దీనికి ఆదరణ కరువవడంతో ఆ కులస్థులు వారి వృత్తిని వదిలి ఇతర వృత్తుల వైపు మారుతుండటంతో క్రమేపి పల్లెల్లో ఈ సందడి తగ్గుముఖం పట్టింది. అదే కాకుండా సంక్రాంతి పండుగకు పది రోజుల ముందే గంగిరెద్దుల వారు పల్లెలకు రాకుండా పట్నం బాట పడుతున్నారు. అక్కడ గంగిరెద్దులకు మంచి ఆదరణ లభించడమే ఇందుకు కారణం.

హుస్నాబాద్‌లో ఎక్కువ మంది

ఎప్పుడూ సంచారజీవితం గడిపే గంగిరెద్దులవాళ్ల హుస్నాబాద్ ప్రాంతంలోనే ఎక్కువగా స్థిరపడ్డారు. నంగునూర్, ముంద్రాయి, గట్లమల్యాల, ఆకునూర్, హుస్నాబాద్, ఆరపల్లి, హుస్నాబాద్ నియోజకవర్గం లోని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్, బొమ్మనపల్లి, హన్మకొండ జిల్లా భీమదేవర పల్లి మండలం కొప్పూరు, కందుగుల, ఇందిరానగర్ గ్రామాల్లో ఉన్నారు. వీరికి సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు చేతినిండా డబ్బులు, ధాన్యం, పిండి వంటలు వంటివి లభిస్తాయి. అయితే వీరు జూన్ నెల నుంచి సెప్టెంబర్ మాసం వరకు 4 నెలల పాటు ఇంటి పట్టున ఉంటారు. సెప్టెంబర్ నుంచి మే నెల వరకు 8 నెలలు సంచార జీవితాన్ని గడుపుతారు. ప్రస్తుతం వీరు కూడా వ్యవసాయం, ఇతర పనులు చేస్తుండటంతో ముఖ్యమైన పండగ దినాల్లోనే పట్నాల బాట పడుతున్నారు. అంతగా గిట్టుబాటు లేకపోవడంతో ఈ రోజుల్లో గంగిరెద్దుల కులస్థులు ఇతర వృత్తుల్లోకి వెళ్తన్నారు. పూటగడవడం కోసం గంగిరెద్దుల కుటుంబాల్లో ప్రతి ఒక్కరూ పని చేస్తుంటారు. మగవాళ్ల గంగిరెద్దులను ఆడిస్తుంటే మహిళలు మాత్రం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబానికి చేదోవాదోడుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

పల్లెల్లో ఆదరణ లేకనే పట్నాలకు



పల్లెల్లో మునుపటి లెక్క ఆదరణ లేకనే పది పైసలు దొరుకుతాయని మా వాళ్ల పట్నాలకు పోతున్నారు. అప్పట్లో సంక్రాంతికి కల్లాల వద్దకు పోతే వడ్ల, జొన్నలు పెట్టేవారు. ఇప్పుడు అదీ లేదు. ఇప్పుడు మా వాళ్ల చిన్నచిన్న వ్యాపారాలు చేస్తున్నరు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మందికి పైగా ఉన్నం. ఇప్పుడు బీసీ-ఎ లో ఉన్నం. ఎస్టీలో చేర్చాలని కోరుతున్నం. సర్కార్ మా గురించి పట్టించుకోవాలే.

-గంట సమ్మయ్య, గంగిరెద్దుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి



క్రైం కార్నర్

యువకుడి దారుణ హత్య

- వివాహేతర సంబంధాలే కారణం!



శ్రీనివాస్ (ఫైల్)

జోగిపేట, జనవరి12 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు దారుణంగా హత్యకు గురైన ఘటన మండలంలోని తాలెల్మ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ అనిల్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నాదులాపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల శ్రీనివాస్(30)ను గుర్తుతెలియని దుండగులు గొంతుకోసి, ఆపై బండరాతితో తలపై మోది దారుణంగా హత్య చేశారు. శనివారం ఉదయం ఇంట్లోంచి వెళ్లిన శ్రీనివాస్, సాయంత్రం వరకూ ఇంటికి రాలేదు. దీంతో అతడి తండ్రి మల్లేశం శనివారం రాత్రి జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం తాలెల్మ గ్రామ శివారులోని చెక్ డ్యాం వద్ద ఓ మృతదేహం కనిపించిందంటూ కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ అనిల్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కర్రోళ్ల మల్లేశంను పిలిపించి మృతదేహాన్ని చూపింగా తన కొడుకుదేనని నిర్ధారించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. వివాహేతర సంబంధాలే ఈ హత్యకు కారణమని తెలిసింది.

పాత కక్షలతో డ్రైవర్..



షేక్ సమీర్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షల నేపథ్యంలో ఓ డ్రైవర్ దారుణ హత్యకు గురైన ఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన షేక్ సమీర్ అలియాస్ అమూల్(27) బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం సంగారెడ్డి పట్టణానికి వచ్చి శాంతినగర్‌లో భార్యాపిల్లలతో నివాసముంటున్నాడు. సమీర్ పగటి పూట డ్రైవర్‌గా పనిచేస్తూ, రాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. సంగారెడ్డి, సదాశివపేట, పటాన్‌చెరు, శంకర్‌పల్లి ప్రాంతాల్లో కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలకు పాల్పడగా కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటకు చెందిన అనీస్ అనే వ్యక్తిని సమీర్ దొంగతనం కేసులో నిందితుడిగా ఇరికించాడు. తనకు ఎలాంటి సంబంధం లేకుండా సమీర్ తనను దొంగతనం కేసులో ఇరికించాడనని అనీస్ కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న అర్ధరాత్రి సంగారెడ్డి పట్టణంలోని సితార థియేటర్ ఎదురుగా ఉన్న గ్రౌండ్ ఖాళీ స్థలానికి సమీర్, అనీస్‌లు వెళ్లారు. అప్పటికే కోపంతో ఉన్న అనీస్ తన వెంట తెచ్చుకున్న కత్తితో సమీర్ గొంతు, మెడపై దాడి చేసి దారుణంగా హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి సీఐ రమేష్ తదితరులు చేరుకుని దర్యాప్తు జరిపారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

చెరువులో దూకిన వ్యక్తి గల్లంతు



శ్రీకాంత్ (ఫైల్)

పటాన్‌చెరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి అమీన్‌పూర్ పెద్దచెరువులో దూకగా గల్లంతైన సంఘటన అమీన్‌పూర్‌లో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పట్టణంలో నివాసం ఉండే శ్రీకాంత్ (38) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా భార్యతో తరచూ గొడవలు జరగుతున్నాయి.డబ్బులు కావాలంటూ శనివారం అర్ధరాత్రి కూడా భార్యతో గొడవ పడి ఇంట్లోని సోఫాలను దగ్ధం చేశాడు. దీంతో ఆమె 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇంటి వద్దకు వచ్చి శ్రీకాంత్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి వెళ్లారు. కాసేపటికి శ్రీకాంత్ ఇంటి ఎదురుగా ఉన్న పెద్దచెరువులో దూకాడు. సమాచారం అందుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, గజ ఈతగాళ్లు చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా శ్రీకాంత్ ఆచూకీ లభించలేదు. గతంలో కూడా భార్యతో గొడవ పడిన శ్రీకాంత్ చెరువులో దూకడంతో గ్రామస్థులు రక్షించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ పోలీసులు తెలిపారు.

రూ.24 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సంగారెడ్డి క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వ్యక్తి రూ.24లక్షలు పోగొట్టుకున్నాడు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన కె.దుగ్గిరెడ్డికి ఫోన్ యాప్‌లో గుర్తు తెలలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ఓ కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపాడు. దీంతో దుగ్గిరెడ్డి మొదట రూ.3లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశాడు. తర్వాత విడతల వారీగా మొత్తం రూ.24లక్షలు చెల్లించాడు. తన డబ్బుతో పాటు లాభం కూడా ఇవ్వాలని దుగ్గిరెడ్డి పలుమార్లు సదరు వ్యక్తికి ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్టు తెలుసుకొని సంగారెడ్డి రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

సంగారెడ్డి క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం గుడితండాలో వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఆయిల్ చోరీ చేసినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. గుడి తండాలో ట్రాన్స్‌ఫార్మర్ పని చేయడం లేదని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు ట్రాన్స్‌ఫార్మర్‌ను తనిఖీ చేయగా ఆయిల్ చోరీ అయినట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హైనా దాడిలో 30 గొర్రెల మృతి



పంచనామా చేస్తున్న ఫారెస్ట్ అధికారి

మద్దూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం ధర్మారం, మర్మాముల గ్రామాలలో హైనా దాడిలో గొర్రెలు మృత్యువాతపడ్డాయి. బాధితులు గుడిసె కొమురయ్య, చెట్కూరి ఇస్తారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిన్న రాత్రి హైనా దాడి చేయడంతో ధర్మారంలో 12 గొర్రెలు, మర్మాములలో 18గొర్రెలు చనిపోయినట్లు తెలిపారు. ఈ విషయమై ఫారెస్ట్ ఆఫీసర్ అధికారికి ఫోన్ చేయగా, సంఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా జరిపారు.

పండుగపూట.. ధరల మోత

(3వ పేజీ తరువాయి)



పల్లీలు, బెల్లం, నువ్వులు వంటి నిత్యావసర సరుకుల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. కూరగాయాల రేట్లు అటు ఇటుగా అందుబాటులో ఉన్నా వెల్లులి మాత్రం ఘాటెక్కిస్తుంది. ప్రస్తుతం కిలో రూ.400 వరకు పలుకుతున్నది. వెల్లుల్లి అధికంగా పండించే ఉత్తర భారతం నుంచి దిగుమతులు తగ్గిపోవడమే ధర పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. అల్లం రూ.120, కందిపప్పు రూ.180 వరకు విక్రయిస్తున్నారు. ఆరు నెలల క్రితం కిలో రూ.130కి లభ్యమయ్యే నువ్వులు ప్రస్తుతం రూ.250 లకు ఎగబాకడం ఆందోళన కలిగిస్తోంది. పండుగకు అరిసెలు, గర్జెలు, పల్లీల ఉండలు, పేలాల ఉండలు, ఇలా బెల్లంతో పలు వంటకాలు చేస్తారు. ప్రస్తుతం బెల్లం ధరలు కూడా పెరిగాయి. మూడు నెలల క్రితం కిలో రూ.60 ఉండగా.. ప్రస్తుతం రూ.80కు చేరింది. నిత్యం వినియోగించే బియ్యం ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సన్నాల ధరలు మరీ అధికంగా ఉన్నాయి. జయశ్రీ సూపర్ ఫైన్ రైస్ క్వింటా రూ.8 వేలకు విక్రయిస్తున్నారు. హెచ్‌ఎంటీ బియ్యం రూ.6 వేలు పలుకుతున్నది. ఏది కొనాలన్నా.. ఏది తినాలన్న ఒకటి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తుందంటున్నారు సామాన్యులు.

రేట్లు చెబితే అవాక్కవుతున్నారు

హోల్‌సేల్ మార్కెట్‌ను బట్టి, మేం రిటైల్ అమ్మకాలు చేస్తాం. పెరిగిన రేట్లను వినియోగదారులకు చెబితే అవాక్కవుతున్నారు. లాస్ట్ టైమ్ తీసుకున్నప్పుడు తక్కువ ఉంది కదా. ఇప్పుడు ఇంతా రేట్ పెరిగిందా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ ధరల నియంత్రణ మా చేతుల్లో లేదు కదా. గతంతో పోలిస్తే విక్రయాలు కూడా తగ్గాయి.

- అంజనేయులు, కిరాణషాపు యజమాని, సిద్దిపేట

ఆదాయం తక్కువ.. ఖర్చు ఎక్కువ

నెలసరి వచ్చే ఆదాయం తక్కువగా ఉంటుంది. కానీ ఖర్చులు చూస్తే మాత్రం ఎక్కువ అవుతున్నాయి. పండుగలు వస్తే అది మరో అదనపు ఖర్చుగానే అనిపిస్తోంది. పండుగ సంబురం మాట పక్కన బెడితే పండుగ సామాను తీసుకరావాలని మార్కెట్‌కు వెళ్లాలంటే భయంగా ఉంది. ఎన్ని ప్రభుత్వాలు మారిన కూడా సామాన్య ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర సరుకుల ధరలు మాత్రం తగ్గించటం లేదు.

- దీక్షిత, గృహిణి, సిద్దిపేట





పొట్లపల్లిలో ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన చలువ పందిర్లు, కొలువుదీరిన రాగుల మల్లికార్జునస్వామి

నేటి నుంచి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

హుస్నాబాద్‌రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని స్వయంభూ పార్వతీ భ్రమరాంబ సమేతా రాగుల మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. 13న గణపతిపూజ, సహస్రనామార్చన, రుద్రాభిషేకం, శివకల్యాణం, కుంకుమార్చన, 14న అభిషేకం, దిష్టికుంభం, వీరభద్రస్వామి, భద్రకాళి పూజ, సాయంత్రం ఎడ్ల బండ్ల తిరుగుట, బోనాలు, పట్నం, అగ్నిప్రతిష్ఠ, 15న అగ్నిగుండాల ప్రవేశం, గోపూజ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకుడు మహేశ్వర్ తెలిపారు.

రేపటి నుంచి బండమల్లన్న జాతర



మిరుదొడ్డి : బండపై వెలిసిన రాజరాజేశ్వరస్వామి

మిరుదొడ్డి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి-జంగపల్లి గ్రామాల మధ్య ఉన్న బండ మల్లన్న జాతర రేపటి నుంచి షురూ కానున్నది. సంక్రాంతిని పండుగను పురస్కరించుకుని మూడు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరెడ్డి తెలిపారు. 109 ఎకరాల్లో మల్లన్న స్వామితో పాటు పాండవులవిగ్రహాలు, రాజరాజేశ్వర, వేంకటేశ్వర, పోషమ్మ, ఆంజనేయస్వామి, నాగదేవతల ఆలయాలు ఉన్నాయి. వీరారెడ్డిపల్లి, జంగపల్లి, అల్మాజీపూర్, గాజులపల్లి, మల్లుపల్లి, దోమ్మాట, చెప్యాల గ్రామాలకు చెందిన 80 ఎడ్ల బండ్లను బండ మల్లన్న చుట్టూ ఊరేగిస్తారు.

ఉత్సవాలకు అనాజీపూర్ ముస్తాబు



రాతిగుండుపై వెలసిన బయ్యన్న

రాయపోల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మూడు రోజులపాటు నిర్వహించే ప్రత్యేక ఉత్సవాలకు రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామం ముస్తాబైంది. మంతూరుకు వెళ్లే రహదారిపై ఉన్న బయ్యన్న గుండ్ల వద్ద బయ్యన్నస్వామి ఆలయంతోపాటు పురాతన బద్దిపోచమ్మ, ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇటీవల రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని కూడా నిర్మించారు. ఇక్కడ సోమవారం గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు పురోహితుడు నారాయణస్వామి తెలిపారు. అలాగే మంగళవారం ఎడ్ల బండ్ల ఊరేగింపు, ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు, బుధవారం గ్రామ సమీపంలోని దుర్గామాత ఆలయం వద్ద జాతర, రాత్రి బోనాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

లీఫ్ ఆర్టిస్టుకు నటుడు సోనూసూద్ అభినందన



నారాయణఖేడ్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ కళను మెచ్చుకుంటూ హిందీ చలనచిత్ర నటుడు సోనూసూద్ అభినందించారు. ఆదివారం సోనూసూద్ కర్ణాటకలోని బీదర్‌లో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని తిరిగి ముంబయికి వెళ్తూ.. న్యాల్‌కల్ మండలం గంగ్వార్ చౌరస్తా వద్ద వాహనం ఆపి అభిమానులతో కొంతసేపు మాట్లాడారు. అక్కడ శివకుమార్ రావి ఆకుపై సోనూసూద్ చిత్రాన్ని జ్ఞాపికగా ఫ్రేమ్ కట్టించి అందజేశారు. రావి ఆకుపై చిత్రాన్ని మలిచే కళలో రాణిస్తున్నందుకు అభినందించారు.

కోహీర్‌లో ఇళ్ల సర్వే పూర్తి

కోహీర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే 100 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. మండలంలోని 24 పంచాయతీల నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం 13,978 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న ప్రతిఒక్కరి ఇంటి వద్దకు పంచాయతీ కార్యదర్శులు వెళ్లి ఫొటో క్యాప్చర్, ఆధార్, రేషన్‌కార్డు వివరాలను నమోదు చేశామన్నారు. ఆదివారం నాటికి 100 శాతం సర్వే పూర్తయిందని చెప్పారు.

దొంగల హల్‌చల్

- కవలంపేటలో రూ.2.6 లక్షలు, బంగారం చోరీ
- న్యాల్‌కల్ వైన్స్‌లో నగదు, మద్యం బాటిళ్ల తస్కరణ

కంది, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కవలంపేట గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం గ్రామానికి చెందిన ఎండీ ఆశం హైదరాబాద్‌లోని తన బంధువుల పెళ్లికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దొంగలు తాళాలు విరగ్గొట్టి బీరువాలోని రూ.లక్షన్నర నగదుతో పాటు తులంన్నర బంగారు ఉంగరాలను దోచుకెళ్లారు. అదే ఇంట్లోని కిరాణా దుకాణంలో రూ.10వేలు విలువ చేసే సబ్బులు, టూత్‌పేస్టులు, కొన్ని వస్తువులు పట్టుకుపోయారు. అలాగే గ్రామంలోని బ్యాగరి మల్లేశం శనివారం బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం 8 గంటలకు వచ్చి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉన్నది. లోపలికి వెళ్లి చూడగా ఇనుపపెట్టెలో తన కూతురికి వైద్య ఖర్చులకోసం దాచుకున్న రూ.లక్ష కనిపించలేదు. దుండగులు ఆ పెట్టను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపారు. కాగా, కవలంపేట గ్రామంలో గ్రామ పంచాయతీ నుంచి ఏర్పాటు చేసిన దాదాపు 20 సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



కవలంపేటలో ఖాళీ ఇనుప పెట్టెను చూపిస్తున్న బాధితుడు

ప్రభుత్వ కార్యాలయాలు, వైన్స్‌లో..

న్యాల్‌కల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన న్యాల్‌కల్ దోపిడి దొంగలు బీభత్సం సృష్టించారు. వివరాల్లోకి వెళ్లితే శనివారం రాత్రి దుండగులు ఎంపీడీవో, తహసీల్దార్, ఐకేపీ కార్యాలయాల తాళాలను పగులగొట్టి ప్రవేశించి బీరువాలను పగులగొట్టారు. అందులో ఏమి దొరకకపోవడంతో ఫైళ్లను చిందరవందరగా పడవేసి వెళ్లిపోయారు. అనంతరం సిద్ది వినాయక వైన్స్‌లో దొంగతనానికి పాల్పడి క్యాష్ కౌంటర్‌లోని రూ.20వేల నగదు, మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆయా ప్రాంతాల్లో సీసీఫుటేజీలను పరిశీలించగా చోరీ దృశ్యాలు కనిపించాయి. దీన్ని ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో నిమగ్నమైనట్లు హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



న్యాల్‌కల్‌లోని వైన్స్‌లో సీసీ కెమెరాల్లో చిక్కిన చోరీ దృశ్యాలు

ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త

సంగారెడ్డి క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలకు వలస వచ్చిన ప్రజలు సంక్రాంతికి సొంతూళ్ల బాట పట్టారు. ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సమేతంగా ఊరెళ్తున్నారు. ఇదే అదనుగా భావించి దొంగలు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

సంక్రాంతి పండగకు వెళ్లే వారంతా ఇరుగుపొరుగు వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఖరీదైన వస్తువులను వెంట తీసుకెళ్లడమే ఉత్తతమని, లేదంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని చెబుతున్నారు. కాలనీలవారీగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలని, ఇంటికి తాళం వేసినప్పటికీ ఇంట్లో మనుషులు ఉన్నట్టుగా పరిసరాలను ఉంచుకోవాలంటున్నారు. అందుకోసం ఆరుబయట బట్టలు ఆరవేయడం, డోర్ ఎదుట చెప్పులు ఉంచడం, తాళం కనిపించకుండా కర్టేన్లు వేయాలని సూచిస్తున్నారు. అలాగే సమీప పోలీస్‌స్టేషన్‌లలో సమాచారం అందివ్వాలని, ఇరుగుపొరుగువారి ఫోన్ నంబర్లను దగ్గర ఉంచుకోవాలని చెబుతున్నారు. ఊళ్లకు వెళ్తున్న సమయాల్లో సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టవద్దని సూచిస్తున్నారు.

జాతరకు పూర్తి ఏర్పాట్లు

మిరుదొడ్డి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి-జంగపల్లి గ్రామాల పరిధిలోని సంక్రాంతిపండుగను పురస్కరించుకుని శ్రీబండ మల్లన్న ఆలయం వద్ద జాతరకు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గ్రామంలో బండమల్లన్న జాతర ఏర్పాట్లను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జాతర వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేడు గోదా రంగనాథుల కల్యాణం

కోహెడ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి హరిహర క్షేత్రంలో సోమవారం శ్రీగోదాదేవిరంగనాథుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు అర్చకులు కోహెడ ప్రసాదరావు శర్మ తెలిపారు. నెలపాటు ఉదయం స్వామి వారి ఆలయంలో తిరుప్పావై పాశుర పారాయణం జరిపిన తర్వాత భోగి పండుగ రోజు గోదాదేవి రంగనాథుల కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. భోగి రోజున కల్యాణోత్సవానికి ఏర్పాటు పూర్తయ్యాయన్నారు.

బీటీ రోడ్లు నిర్మించండి మహాప్రభో..!

- పలు గ్రామాలకు వెళ్లేందుకు మట్టిరోడ్లే దిక్కు
- వర్షాకాలంలో కోతకు గురైన రోడ్లపై నుంచే ప్రయాణం చేయక తప్పని దుస్థితి
- రోడ్లు, కాల్వల నిర్మాణం చేపట్టాలంటూ వంగపల్లి గ్రామస్థుల ధర్నా


వంగపల్లి గ్రామంలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ రోడ్డుపై బైఠాయించిన గ్రామస్థులు

మద్దూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు సరైన రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా భూగర్భ జలాలు తగ్గడంతో రైతులు పంటసాగు చేద్దామంటే బోర్లు ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోందని వెంటనే రోడ్లు, సాగునీటి కాల్వల నిర్మాణాలు చేపట్టాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మండలంలోని వంగపల్లి గ్రామస్థులు ఆదివారం గ్రామంలోని బురుజువద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో రోడ్లు, సాగునీటి కాల్వల నిర్మాణాలను చేపట్టాలని ముక్తకంఠంతో నినదించారు. దీంతో గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు చల్లా కమలాకర్‌రెడ్డి, చల్లా జలపతిరెడ్డి, చల్లా లక్ష్మినర్సింహారెడ్డి, మాడిశెట్టి రామాంజనేయులు, దొంతి రాజిరెడ్డి, జోగులసారయ్య, కూరెళ్ల కిరణ్‌కుమార్, ఎర్రబచ్చల సుధాకర్, కూరెళ్ల శ్రీనివాస్, దొంతి బుచ్చిరెడ్డి, ఎర్రబచ్చల కనకయ్య, బొడికె అబ్బయ్య, కనకాచారి, జోగుల రాజు పాల్గొన్నారు.

దయనీయ పరిస్థితిలో రహదారులు

ధర్నా సందర్భంగా గ్రామస్థులు తమ బాధలను ఏకరువు పెట్టారు. ఈ మేరకు.. మండలంలోని వంగపల్లి గ్రామం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లేందుకు బీటీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో కోతకు గురైన మట్టిరోడ్లపై ప్రయాణం చేయలేక అవస్థలు పడుతున్నారు. వంగపల్లి-వల్లంపట్ల, వంగపల్లి-అమ్మాపూర్, వంగపల్లి-ఉప్పరోనిగడ్డ మధ్యన బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. వంగపల్లి-రేబర్తి గ్రామాల మధ్యలోని కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తమ గ్రామానికి సాగునీటి వనరులు లేకపోవడం వలన బోరుబావుల్లో నీరులేక వ్యవసాయం చేసుకోలేని దుస్థితి నెలకొంది. లద్నూరు రిజర్వాయర్ నుంచి వంగపల్లి వరకు కాల్వల నిర్మాణం చేపడితే గ్రామ రైతులకు మేలు కలుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తమ గ్రామంపై పాలకులకు చిన్నచూపెందకంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థులంతా ఐక్యంగా ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు.

దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాల్లో యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, యువజన సంఘాలు, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వివేకానందుడి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలుచోట్ల నిత్యావసర వస్తువుల పంపిణీ, పండ్ల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలను చేపట్టి, ర్యాలీలను నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు స్వామి వివేకానందుడని కొనియాడారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి)


గజ్వేల్ పట్టణంలో వివేకానంద విగ్రహానికి యువజనసంఘాల ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


సిద్దిపేటలో వివేకానంద విగ్రహం వద్ద మాజీమంత్రి హరీశ్‌రావు నివాళి


చేర్యాలలో చిన్నారులతో కలిసి నివాళులర్పిస్తున్న సీఐ ఎల్ శ్రీను

పొట్లపల్లి రామాలయంలో వైభవంగా

గోదారంగనాయకుల కల్యాణోత్సవం


గోదాదేవి-రంగనాయకుల కల్యాణ క్రతువులో పూజారులు

హుస్నాబాద్‌రూరల్, జనవరి (అంధ్రజ్యోతి)12 : హుస్నాబాద్ మండలం పొట్లపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం గోదాదేవి-రంగనాయకస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం 11 గంటలకు స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి రామాలయంలో కల్యాణోత్సవం జరిపించారు. గోదారంగనాయకుల కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో అర్చకులు పరంకుశం వెంకటరామక్రిష్ణ, దీపక్ మిత్రా, ధర్మకర్తలు కల్యాణ క్రతువును జరిపించారు. శివరామ కృష్ణ భక్తజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

దుబ్బాక బాలాజీ ఆలయంలో

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు


స్వామివారి సన్నిధిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దుబ్బాక, జనవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి కృపతో దుబ్బాక ప్రాంతం మరింత సస్యశ్యామలం కావాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆకాంక్షించారు. ఆదివారం దుబ్బాకలో శ్రీబాలాజీ ఆలయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గసభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఉత్తరద్వారా దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఆలయకమిటీ చైర్మన్ శ్రీధర్, నాయకులు తదితరులున్నారు.

ఘనంగా ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు

గజ్వేల్/నంగునూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్‌లో వయనాడ్ పార్లమెంట్ సభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్ తదితరులున్నారు. గజ్వేల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో ఎంపీ, ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నంగునూరులో యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ సాదుల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రియాంకగాంధీ జన్మదినవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎండి ఇమ్రాన్, నాయకులు బడే అశోక్, పోల్ రెడ్డి, నగేష్ శ్రీధర్, బడే నవీన్, వివేక్, గోపి, అజయ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగించిన పోలీసులు

రాయపోల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన మన్నె కరుణాకర్ ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకొని రాయపోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ సాంకేతికతతో ఫోన్‌ను రికవరీ చేసిన పోలీసులు బాధితుడికి అప్పగించినట్టు హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

మాయమాటలతో అధికారంలోకి..

- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో చిన్నకోడూరు మండలం యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులతో హరీశ్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి బంద్ చేసి, ఆరు గ్యారెంటీలను అటకెక్కించారని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కొత్త నిబంధనలు పెట్టి మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లలో పరుగులు పెట్టిన సిద్దిపేట అభివృద్ధి, ఏడాదిలో వెనక్కి వెళ్లిందన్నారు. ఇదేనా కాంగ్రెస్ ప్రజాపాలన అని ప్రశ్నించారు.

ఇదేనా ఇందిరమ్మ పాలన?: బీఆర్ఎస్

చేర్యాల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యస్థాపన చేపడుతున్నామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రౌడీ రాజ్యమేలుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాలనర్సయ్య, జిల్లా నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేర్యాలలో పార్టీ పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడులను తీవ్రంగాఖండిస్తున్నామన్నారు.

ప్రభుత్వానికి రైతుల గోస కనిపించట్లేదా?


తొగుట: లింగాపూర్‌లో కాలువలను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట/మిరుదొడ్డి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల గోస కనిపించడం లేదా అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం తొగుట మండలం లింగాపూర్ గ్రామంలో ప్రాజెక్ట్ కాలువను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కాలువకు మల్లన్నసాగర్ నుంచి నీళ్ల విడుదల చేస్తే లింగాపూర్. ఎల్. బంజర్‌పల్లి, వెంకట్రావ్‌పేట, చెప్యాల. దొమ్మాట, సూరంపల్లి తదితర గ్రామాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న కాలువల నిర్మాణం చేపట్టి రైతాంగానికి సాగు నీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసందర్భంగా గ్రామ శివారులో వరినాట్లు వేస్తున్న మహిళలతో కాసేపు ముచ్చటించి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురయ్య, నాయకులుపాల్గొన్నారు. తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే సింగరాళ్ల మల్లన్న ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మిరుదొడ్డిలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. క్రీడల్లో గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖ కవి శ్రీరాములు, ఎంపీడీవో రాము

సిద్దిపేట రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి); క్రీడలు శారీరక మానసిక వికాసాన్ని కల్గిస్తాయని ప్రముఖ కవి కందుకూరి శ్రీరాములు, చొప్పదండి ఎంపీడీవో దమ్మని రాము అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రావురుకులలో గ్రామానికి చెందిన దివంగత బండి చిన్న నర్సయ్య జ్ఞాపకార్థం సేవాభావ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర సహకారంతో అదివారం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. తాను రావురుకుల గ్రామంలో పెరిగి ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నానని శ్రీరాములు చెప్పారు. మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన డాక్టర్ శ్రీకాంత్‌ను శ్రీకాంత్‌ను అభినందించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ 3 వేలు, ద్వితీయ రూ. 2 వేలు, మెమొంటోలు , స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవిత రవీందర్, మాజీ ఉపసర్పంచ్ మారెడ్డి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పండుగను తలపిస్తున్న ముగ్గుల పోటీలు



సిద్దిపేటలోని 4వ వార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు, బెజ్జంకి మండలంలోని దాచారంలో ముగ్గులు వేసినవారికి అందజేసిన బహుమతులు

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట అర్బన్/జగదేవ్‌పూర్/చేర్యాల/బెజ్జంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని పలు మండలాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులు యువతకు పతంగుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రతిభ కనబరిచినవారికి బహుమతులను అందజేశారు. సిద్దిపేట పట్టణంలోని 4, 9 వార్డుల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో మాజీమంత్రి హరీశ్‌రావు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ మన భావి తరాలకు అందించాలని సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో తాజా మాజీ ఎంపీటీసీ నాగుల స్రవంతి ప్రశాంత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించగా మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతులను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో కేబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ ప్రతిబింబించేలా గంగిరెద్దుల ముగ్గులు, హరిదాసుల కథలు, చెరుకుగడలు, పాలపొంగులు, గాలిపటాలతో కూడిన అందమైన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. విజేతలకు పీఏసీఎస్ డైరెక్టర్ కావుల్ల భూమయ్య బహుమతులతో పాటు పోటీలో పాల్గొన్న మహిళలందరికీ చీరలను పంపిణీచేశారు. అదేవిధంగా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో జైభీమ్ నగర్ కాలనీలో జైభీమ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో గ్రోమోర్ కంపెనీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు.బెజ్జంకి మండలంలోని దాచారం గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం ముందస్తుగా మహిళలు, యువతులకు మాజీ ఎంపీటీసీ, బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రోడ్డుభద్రతా నిబంధనలు పాటించాలి


మద్దూరు: సలాక్‌పూర్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

మద్దూరు/జగదేవ్‌పూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆదివారం మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ మద్దూరు మండలంలోని సలాక్‌పూర్ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు నిబంధనలు పాటించాలని సూచించారు. జగదేవ్‌పూర్‌లో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బందితో కలిసి స్టేషన్ నుంచి గొల్లపల్లి ఎక్స్ రోడ్డు వరకు రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారుడు వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నింటిని వెంట ఉంచుకోవాలని సూచించారు. యువకులు ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు.

పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో 'కనువిప్పు'

జగదేవ్‌పూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి గ్రామంలో శనివారం రాత్రి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. నరసయ్య కానిస్టేబుల్, పోలీస్ కళాబృందం సభ్యులు, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు కార్యక్రమంలో గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, జనవరి12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటింటికీ తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సూచించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో నారాయణరావుపేట మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలకు సమయం ఆసన్నమైందని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మంద పాండు, ముద్దం లక్ష్మీ, చింతల రాజ్‌వీర్, బుచ్చిరెడ్డి, సదాశివరెడ్డి, యాదగిరి, దాసరి ఉమ, బుచ్చెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, ప్రజాసంక్షేమం: 'కొమ్మూరి'

చేర్యాల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల మండలం గుర్జకుంట, దొమ్మాట, ముస్త్యాల గ్రామాలలో ఆదివారం సీసీరోడ్ల నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పులు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. జనగామ నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో తీర్చిదిద్దేందు కు అహర్నిశలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రియంకా గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. చేర్యాలలోని 2వ వార్డుకు చెందిన తిగుళ్ల మల్లవ్వకు రూ.60వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, నాయకులు పూర్మ ఆగంరెడ్డి, ఆడెపు చంద్రయ్య, తడక లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి : నరేందర్‌రెడ్డి

బెజ్జంకి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తానని రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని ఉమ్మడి మెదక్, అదిలాబాద్, నిజాంబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఉమ్మడి బెజ్జంకి, గన్నేరువరం మండలాలకు చెందిన పట్టభద్రులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం నుంచి యువతకు దక్కాల్సిన హక్కులు, ఉపాధి ఉద్యోగ అవకాశాలు అమలయ్యేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని కోరారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు.

బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య

● మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి పిరికిపందల చర్య అని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చామంటూ నీతులు చెబుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడమే ఇందిరమ్మ రాజ్యామా అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

పేరుకే పెద్దాస్పత్రి.. రోగులపై చిన్నచూపు!

(3వ పేజీ తరువాయి)

కొందరు వైద్యులు కస్సుబుస్సుమంటూ చిందులు వేస్తున్నారు. ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న తరువాత సంబంధిత వైద్యుడి దగ్గరికి వెళ్లాలని రిజిస్ట్రేషన్ కౌంటర్ ఉద్యోగులు సూచిస్తున్నారు. వైద్యుడి రూము ఎక్కడ ఉంది తెలియక, కనిపించిన సెక్యూరిటీనీ అడిగితే కోపంగా సమాధానం చెబుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రోగి వద్దకు వెళ్లాలంటే పలువురు సెక్యూరిటీ గార్డులు మరో వింతగా వ్యవహరిస్తున్నట్లు, ఇష్టం వచ్చినట్లు మాట్లాడటమే కాకుండా బూతులు తిడుతున్నారని రోగుల బంధువులు చెబుతున్నారు.

హవ్వా.. బ్యాండేజీ, కుట్లు వేసే దారం లేదా?

జీజీహెచ్ అత్యవసర విభాగంలో కనీసం బ్యాండేజీ, కుట్లు వేసే దారం కూడా అందుబాటులో లేనట్లుగా కనిపిస్తోంది. ఇటీవల ఓ వ్యక్తి బైకు మీద నుంచి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారమందించి జీజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడిని పరిక్షించాల్సిన వైద్యులు అరగంటైనా రాలేదని రోగి బంధువులు తెలిపారు. తీరిగ్గా వచ్చిన ఓ వైద్యుడు కుట్లు వేసేందుకు దారంతో పాటు, బ్యాండేజ్ కొనుక్కుని రావాలని సూచించగా..ఆస్పత్రి బయటనున్న మెడికల్ షాపులో రూ.400 విలువ చేసే కుట్లు వేసే దారం, రూ.200 విలువైన బ్యాండేజ్‌లను తీసుకెళ్లారు. అప్పుడు కానీ వైద్యులు చికిత్స అందించలేదని బంధువులు తెలిపారు. ఇది షరా మాములుగా జరుగుతున్నట్లు అక్కడున్న వారంతా మాట్లాడుకోవడం చర్చాంశనీయమైంది.

నిరంతర పర్యవేక్షణ కరువు

నిత్యం వేలాది సంఖ్యలో జీజీహెచ్ ఆసుపత్రికి వస్తుండటంతో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఆసుపత్రిలోని పలు బాత్‌రూములు కంపుకొడుతున్నాయి. ముఖ్యంగా ఆసుపత్రిలోని ఐసీయూ విభాగం వద్దనున్న వాష్‌రూము అధ్వానంగా మారింది. రోగులు, బంధువులు అటువైపు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నిరంతర పర్యవేక్షణతో ఉండటంతో క్రమశిక్షణతో వ్యవహరించేవారు. కొన్ని నెలలుగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపే వెళ్లకపోవడం, పర్యవేక్షణ లేకపోవడంతో ఆడింది ఆట, పాడింది పాటలాగా సాగుతున్నది. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, అవసరమైన సామగ్రిని సమకూర్చి మెరుగైన వైద్యం అందించాలని రోగులు, వారి బంధువులు వేడుకుంటున్నారు.